## 20న జిల్లా పరిషత్తు సర్వసభ్య సమావేశం

షాబాద్, ఫిబ్రవరి 17: ఈ నెల 20న రంగారెడ్డిజిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటలకు జడ్పీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి అధ్యక్షతన సమావేశం జరుగుతుందని తెలిపారు.

## అంతర్జాతీయ సదస్సుకు అధ్యాపకుడు డా.రవీందర్‌రెడ్డి



షాద్‌నగర్‌టౌన్, ఫిబ్రవరి 17 : న్యూఢిల్లీలోని జన్‌పథ్ రోడ్డు అంబేద్కర్ అంతర్జాతీయ సెంటర్‌లో ఈ నెల 25, 26 తేదీల్లో జరిగే అంతర్జాతీయ సదస్సుకు షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ ఎస్.రవీందర్‌రెడ్డి శనివారం ఎంపికయ్యారు. యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీ అనుబంధ శివాజీ కాలేజ్ కొలాబరేషన్‌తో శైక్షక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రిసర్జెంట్ భారత్ అన్ ది గ్లోబల్ కాన్వాస్ అనే అంశంపై ఈ అంతర్జాతీయ సదస్సును నిర్వహిస్తున్నారని ఆయన తెలిపారు. ఈ సదస్సులో నూతన విద్యా విధానంపై ఇంప్లిమెంటింగ్ న్యూ ఎడ్యుకేషన్ పాలసీ 2020 త్రూ గవర్నెన్స్ అండ్ టెక్నాలజీ అనే అంశంపై పరిశోధనా పత్రాన్ని ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉన్నత విద్యలో పరిశోధన పత్రాలకు అత్యధిక ప్రాముఖ్యమున్న నేపథ్యంలో అంతర్జాతీయ సదస్సుకు ఎంపిక కావడం, తన పరిశోధనా పత్రాన్ని ఎంపిక చేయడంపై సంతోషం వ్యక్తం చేశారు. రవీందర్‌రెడ్డిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కమల, అధ్యాపకులు అభినందించారు.

## ట్రాన్స్‌జెండర్లు గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలి

వికారాబాద్, ఫిబ్రవరి 17 : ట్రాన్స్‌జెండర్లు గుర్తింపు కార్డుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ముఖ్య న్యాయ సహాయ అధికారి వెంకటేశ్ తెలిపారు. శనివారం జిల్లాలోని ట్రాన్స్‌జెండర్లకు వికారాబాద్ మండల సమాఖ్య కార్యాలయంలో మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సాధికారత శాఖ ఆధ్వర్యంలో గుర్తింపు కార్డులు, మహిళల హక్కులు, చట్టాల గురించి, వయోవృద్ధుల హెల్ప్ లైన్ 14567 సర్వీసెస్, దివ్యాంగుల నం.155326, మహిళా హెల్ప్ లైన్ నం.181పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ సభ్యుడు రాము మాట్లాడుతూ.. ట్రాన్స్‌జెండర్లకు భారత రాజ్యాంగం హక్కుల చట్టం 2019 ప్రకారం కొన్ని హక్కులు ఉన్నాయన్నారు. అందులో భాగంగా వారు గుర్తింపు కార్డులకు ఆన్‌లైన్‌లో అప్లై చేసుకుని కలెక్టర్ ద్వారా 15 రోజుల్లో తీసుకోవాలని తెలిపారు. వారికి సమాజంలో ఎటువంటి వివక్ష కలిగినా వారు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు ఇవ్వాలని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం వయోవృద్ధుల హెల్ప్ లైన్ నం.14567 టోల్ ఫ్రీ నెంబర్ ఉపయోగించుకోవాలన్నారు. వృద్ధులకు ఎటువంటి సమస్యలున్నా కాల్ చేయాలని సూచించారు. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు పనిచేస్తుందన్నారు. రాష్ట్ర దివ్యాంగుల హెల్ప్ లైన్ నం.155326ను ఉపయోగించుకొని ఆర్థిక సాయం, సహాయ పరికరాలు, ఐడీ కార్డ్, ఒకేషనల్ ట్రైనింగ్, ఇంకా ఎటువంటి సమస్యలున్నా కాల్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ బలరాం, మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ వరలక్ష్మి, ట్రాన్స్‌జెండర్ జిల్లా అధ్యక్షురాలు రమ్యశ్రీ పాల్గొన్నారు.

## మేడారం సమ్మక్క, సారక్క జాతరకు వికారాబాద్ నుంచి బస్సులు

వికారాబాద్, ఫిబ్రవరి 17 : మేడారం సమ్మక్క, సారక్క జాతరకు వికారాబాద్ ఆర్టీసీ డిపో నుంచి 35 బస్సులు నడుపనున్నట్లు వికారాబాద్ డిపో మేనేజర్ భక్షీనాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18 నుంచి 25 వరకు బస్సులు మేడారానికి వెళ్తాయని పేర్కొన్నారు. మిగిలిన బస్సులతో ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేరవేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 26 నుంచి పూర్తి స్థాయిలో బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు.

## రాజేంద్రనగర్ ఏసీపీగా లక్ష్మినారాయణ

బండ్లగూడ, ఫిబ్రవరి 17: రాజేంద్రనగర్ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్‌గా లక్ష్మినారాయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి శాంతి భద్రతలను కాపాడేందుకు కృషి చేస్తామన్నారు. రాజేంద్రనగర్ ఏసీపీ పరిధిలో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా ప్రజలు తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి పటిష్టమైన నిఘా ఏర్పాటు చేస్తామన్నట్లు తెలిపారు.



రంగారెడ్డిజిల్లా కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న సఫాయి కర్మచారుల జాతీయ కమిషన్ చైర్మన్ వెంకటేశం

# సఫాయి కర్మచారుల సంక్షేమానికి ప్రభుత్వ పథకాలను సక్రమంగా అమలు చేయాలి

### సఫాయి కర్మచారుల జాతీయ కమిషన్ చైర్మన్ వెంకటేశం

షాబాద్, ఫిబ్రవరి 17 : సఫాయి కర్మచారుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను సక్రమంగా అమలు చేసి వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు అన్ని చర్యలు చేపట్టాలని సఫాయి కర్మచారుల జాతీయ కమిషన్ చైర్మన్ వెంకటేశం జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. శనివారం రంగారెడ్డిజిల్లా సమీకృత కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో వెంకటేశం సఫాయి కర్మచారులకై జిల్లా యంత్రాంగం అమలు చేస్తున్న పథకాల పురోగతిపై జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి, జిల్లా అధికారులు, జీహెచ్‌ఎంసీ అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సఫాయి కర్మచారులకు పునరావాసం కల్పించుటలో ప్రభుత్వ పథకాలు వర్తింపజేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో సఫాయి కర్మచారులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో పనిచేస్తున్న సఫాయి కర్మచారులకు వేతన స్లిప్, పీఎఫ్, ఈఎస్ఐ, బీమా అందిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్లు తెలిపారు. సఫాయి కర్మచారులు అపరిశుభ్రమైన ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేయడం వల్ల వారికి ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశాలు ఉన్నాయని.. వీరు నివసించే ప్రాంతాల్లో సంవత్సరానికి 2సార్లు తప్పనిసరిగా వైద్యశిబిరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. సఫాయి కర్మచారులకు ఉపాధి కల్పనలో ప్రత్యేక చొరవ తీసుకోవాలని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్లలో కర్మచారులను నియమించి వీరికి ప్రభుత్వం ప్రకటించిన కనీస వేతనాలను అందించాలని ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే అన్ని సంక్షేమ పథకాలు వారు సద్వినియోగపర్చుకునేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

మహిళా కార్మికుల కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి వారి సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. సఫాయి కర్మచారులకు ప్రధానమంత్రి బీమా యోజన స్కీమ్‌పై అవగాహన కల్పించాలని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో సైబరాబాద్ క్రైమ్ డీసీపీ నర్సింహులు, జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి రామారావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ప్రవీణ్‌రెడ్డి, జిల్లా మైనార్టీశాఖ అధికారి నవీన్‌రెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి రామేశ్వరిదేవి, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, మున్సిపల్ కమిషనర్లు, ఎల్‌డీఎం కుసుమ, సఫాయి కర్మచారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రంగారెడ్డిజిల్లా సమీకృత కార్యాలయానికి శనివారం వచ్చిన సఫాయి కర్మచారుల జాతీయ కమిషన్ చైర్మన్ వెంకటేశంకు కలెక్టర్ శశాంక అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి, సైబరాబాద్ క్రైమ్ డీసీపీ నర్సింహులుతో కలిసి బొకే అందజేసి స్వాగతం పలికారు.



సమావేశానికి హాజరైన వివిధ శాఖల అధికారులు

# స్వాతంత్ర్య సమరయోధులను గౌరవించాలి

### మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు

వికారాబాద్, ఫిబ్రవరి 17 : స్వాతంత్ర్య సమరయోధులను ప్రతిఒక్కరూ గౌరవించాలని మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు అన్నారు. శనివారం వికారాబాద్‌లో డాక్టర్ హారతి ద్వారకానాథ్ రచించిన హైదరాబాద్ సంస్థాన విమోచనానికి ప్రాంతీయ బోధనకు పునాదులు వేసిన తెలంగాణ దార్శనికులు అనే గ్రంథాన్ని ఆవిష్కరించేందుకు ముఖ్య అతిథిగా మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణకు స్వాతంత్ర్యం 1948 సెప్టెంబర్ 17న వచ్చిందని తెలిపారు. భారతీయ భాషలు, సంస్కృతి, ఆధ్యాత్మికతను గౌరవించాలన్నారు. భాస్కరాచార్యుని వంటి గొప్ప కాల గణన చేసేవారు మన దేశంలో జన్మించారని పేర్కొన్నారు. తెలంగాణ కోసం నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడిన వందేమాతరం రామచంద్రారావు, జర్నలిస్ట్ షోయబుల్లాఖాన్‌ల విగ్రహాలు ప్రతిష్ఠించలేదని సభాముఖంగా ఆవేదన వ్యక్తం చేశారు.

ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ బోర్డ్ మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. డాక్టర్ హారతి ద్వారకానాథ్ రచించిన గ్రంథం నేటి సమాజానికి బాగా ఉపకరిస్తుందన్నారు. గతంలో ఎందరో హైదరాబాద్ విమోచనానికి సంబంధించిన పుస్తకాలు రాసినా ఈ గ్రంథం అందుకు భిన్నమైనదని పేర్కొన్నారు. యువతకు, ఉపాధ్యాయులకు, పోటీ పరీక్షలు రాసే వారికి ఇది ఎడారిలో ఒయాసిస్ వంటిదని చమత్కరించారు.

గ్రంథ కర్త హారతి ద్వారకనాథ్ మాట్లాడుతూ.. నిజాం పాలకులు ప్రాంతీయ భాషను ప్రోత్సహించలేదని మండిపడ్డారు. ఆంధ్ర సారస్వత పరిషత్ ఏర్పడిన తర్వాత తెలుగు భాష ప్రాధాన్యత సంతరించుకున్నదని తెలిపారు. తెలంగాణ చరిత్ర పోరాటాలకు అడ్డ.. ఈ చరిత్ర ఆంధ్రుల కాలంలో కనుమరుగైందని ఆవేదన వ్యక్తం చేశారు. తాను రాసిన గ్రంథాన్ని అందరూ చదవాలని ఆయన కోరారు. అనంతరం డాక్టర్ హారతి ద్వారకానాథ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ దీప, సత్యసాయి సేవా సంస్థల అధ్యక్ష కార్యదర్శులు, విశ్రాంత ఉద్యోగులు, న్యాయవాదులు, డాక్టర్లు, లెక్చరర్లు, ఉపాధ్యాయులు, రాజకీయ నాయకులు, ఛాత్రోపాధ్యాయులు పాల్గొన్నారు.

# నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

### చౌడాపూర్‌లోని పల్లె దవాఖానను పరిశీలించిన ఎన్‌క్యూఏఎస్ బృందం



చౌడాపూర్‌లో పల్లె దవాఖానను పరిశీలించిన ఎన్‌క్యూఏఎస్ సిబ్బందిని సన్మానించిన వైద్యులు

కులకచర్ల, ఫిబ్రవరి 17 : పల్లె దవాఖానలో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని జాతీయ ఆరోగ్య ప్రమాణాల ఢిల్లీ బృంద సభ్యులు డాక్టర్ శ్రీరామ్ మొహంతి, డాక్టర్ సువర్ణ అబ్దే పేర్కొన్నారు. శనివారం చౌడాపూర్‌లోని పల్లె దవాఖానను వారు పరిశీలించారు. అనంతరం ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరోగ్య కేంద్రంతో పాటు గ్రామాల్లో కూడా పరిసరాల పరిశుభ్రత పాటించేలా చూడాలని, పల్లె దవాఖానలో అన్ని రిజిస్టర్లు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. ప్రజలు రోగాల బారిన పడకుండా ఉండేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని, సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. పల్లె దవాఖాన సిబ్బంది డాక్టర్ ప్రశాంతిని, ఏఎన్‌ఎం జ్యోతిని పల్లె దవాఖాన గురించి అడిగి తెలుసుకున్నారు. పల్లె దవాఖాన సమాచారాన్ని కేంద్ర ఆరోగ్య వైద్యాధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు. వైద్యశాల పరిశుభ్రత, రోగులకు అందించే వివిధ రకాల సేవలు, బయో మెడికల్ వేస్టేజ్, గర్భిణులు, ప్రసూతి సేవలకు 100 మార్కులకు 90 మార్కులకు పైగా సాధిస్తే పల్లె దవాఖానకు మూడు సంవత్సరాలు వరుసగా లక్షాయాభైవేల రూపాయలు ఆస్పత్రి అభివృద్ధి కోసం కేంద్రం నుంచి నిధులు మంజూరవుతాయని వారు తెలిపారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది ఎన్‌క్యూఏఎస్ బృందాన్ని సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ హాజీవుద్దీన్, డాక్టర్ మాధురి, సీహెచ్‌వో చంద్రప్రకాశ్, డాక్టర్ ప్రశాంతి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జీవరాజ్, ఎన్‌క్యూఏఎస్ సిబ్బంది ఛండీశ్వరి, అనురాధ, ఏఎన్‌ఎం జ్యోతి, హెల్త్ అసిస్టెంట్ అంజు, ఆశా కార్యకర్తలు పాల యాదమ్మ, పెరుగు యాదమ్మ, జంగమ్మ, ఊర్మిళ, పుష్పలత, పుష్పమ్మ పాల్గొన్నారు.

# 42 దొంగతనాలు.. 36 కేసులు

- 30.3 తులాల బంగారం, 1.40 కేజీల వెండి, మూడు బైక్‌లు స్వాధీనం
- అంతర్‌జిల్లా దొంగ వివరాలు తెలిపిన వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కోటిరెడ్డి

వికారాబాద్, ఫిబ్రవరి 17 : 42 దొంగతనాలు.. 36 కేసుల్లో ప్రధాన నిందితుడైన అంతర్ జిల్లా దొంగను పోలీసులు, సీసీఎస్ పోలీసులు పట్టుకున్నట్లు వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. శనివారం వికారాబాద్‌లోని పాత పోలీస్ స్టేషన్ పరిధిలో అంతర్ జిల్లా దొంగను పట్టుకొని వివరాలు మీడియాకు తెలిపారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం కరక్కాయల గూడెంకు చెందిన ఆంజనేయులు (అంతర్ జిల్లా దొంగ) తాళం వేసిన ఇండ్లనే లక్ష్యంగా చేసుకొని దొంగతనాలకు పాల్పడేవాడు. అతడిని వికారాబాద్ జిల్లా పోలీస్ అధికారులు నమ్మదగిన సమాచారం మేరకు పట్టుకున్నట్లు తెలిపారు.

నవాబుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని పులుమామిడి గేటు వద్ద మోమిన్‌పేట్ సీఐ ఆంజనేయులు, సీసీఎస్ సీఐ బలవంతయ్య, సీసీఎస్ సిబ్బంది, నవాబుపేట్ ఎస్సై భరత్ భూషణ్, సిబ్బందితో శనివారం ఫిబ్రవరి 17న ఉదయం 5 గంటల నుంచి వాహనాల తనిఖీ చేశారు. యూనికాన్ బైక్‌పై వచ్చిన ఒక వాహనదారుడు పోలీస్ అధికారులను చూసి పారిపోవడానికి ప్రయత్నించాడు. అతడిపై అనుమానం వచ్చి పట్టుకొని అతడి వద్ద ఉన్న బ్యాగ్‌ను తనిఖీ చేయగా బంగారం, వెండి ఆభరణాలు కనిపించాయన్నారు. విచారించగా నేరస్తుడు ఆంజనేయులు కరక్కాయల గూడెం, హుజూర్‌నగర్ మండలం, సూర్యాపేట జిల్లా అని తెలిపారన్నారు. వివిధ ప్రాంతాల్లో చోరీ చేసిన సొత్తును వికారాబాద్‌లో అమ్మడానికి తీసుకొని వెళుతూ పట్టుబడ్డాడని తెలిపారు.


ఫిబ్రవరి 7న రాత్రి నవాబుపేట మండలం వట్టిమీనపల్లి గ్రామం వద్ద ప్రజలెవ్వరూ లేరని గమనించి ఆ గ్రామంలో దొంగతనం చేయడం కోసం ఇంటిని వెతికాడన్నారు. ఒక ఇంటికి తాళం వేసి ఉండడం గమనించి తన వెంట తెచ్చుకున్న ఇనుపరాడ్డుతో ఆ ఇంటి తాళం విరగ్గొట్టి లోపలికి ప్రవేశించాడు. అనంతరం రెండు బీరువాల్లోని బంగారం, వెండి ఆభరణాలు, రూ.60 వేల నగదును దొంగిలించినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు.

గత సంవత్సరం డిసెంబర్ 11న వికారాబాద్‌లోని అస్సాం బేకరీ వద్ద ఒక ఇంటికి తాళం వేసి ఉండటాన్ని గమనించి, లోపలికి వెళ్లి డోర్ తాళాన్ని విరగ్గొట్టినట్లు తెలిపాడు. ఇంటిలోకి ప్రవేశించి కప్‌బోర్డ్‌లో ఉన్న వెండి, బంగారు ఆభరణాలను దొంగిలించాడని చెప్పారు.

ఇటీవల కాలంలోనే కోదాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో 4 చోట్ల దొంగతనాలు చేసినట్లు నేరస్తుడు ఒప్పుకున్నట్లు పేర్కొన్నారు. ఆంజనేయులు ఇప్పటివరకు నల్గొండ జిల్లాలో 25 కేసులు, ఖమ్మం జిల్లాలో 4 కేసులు, వరంగల్ జిల్లాలో 4 కేసులు, సిద్ధిపేట జిల్లాలో 2 కేసులు, సంగారెడ్డి జిల్లాలో 1 కేసు మొత్తం 36 దొంగతనం కేసుల్లో జైలుకు వెళ్లి వచ్చినట్లు వివరించారు.

ప్రస్తుతం ఆంజనేయులును నవాబుపేట్ పోలీస్‌స్టేషన్‌లో ఒక కేసు, వికారాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఒక కేసు, కోదాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో 4 కేసులకు సంబంధించి అరెస్ట్ చేసినట్లు ఎస్పీ తెలిపారు. వివిధ జిల్లాల్లో ఉన్న కేసులతోపాటు ఈ 6 కేసులను కలుపుకొని మొత్తం 42 కేసులు నమోదయ్యాయన్నారు.

ఆంజనేయులు నుంచి 30.3 తులాల బంగారం, 1.40 కిలోల వెండి, మూడు బైక్‌లు (యూనికార్న్, గ్లామర్, రాయల్ ఎన్‌ఫీల్డ్)లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఇతడిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని ఎస్పీ తెలిపారు. గ్రామాలు, పట్టణాలు, ఇండ్ల ఎదుట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే దొంగల కదలికలను బట్టి త్వరగా దొంగను పట్టుకోవచ్చని చెప్పారు. ఇందుకు సహకరించిన పోలీస్ అధికారులను, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. వారికి తగిన పారితోషకాన్ని అందజేశారు. కార్యక్రమంలో వికారాబాద్ డీఎస్పీ అంజయ్య, సీఐలు శ్రీను, ఎస్సైలు, సిబ్బంది ఉన్నారు.



నేరస్తుడి నుంచి పోలీసులు రికవరీ చేసిన బంగారం, వెండి ఆభరణాలు, బైక్‌లు

# ఎన్నికల సందడి

- స్కూల్ లీడర్ ఎంపిక కోసం ఎలక్షన్
- విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు ఈ నిర్ణయం



ఓటు వేస్తున్న విద్యార్థిని

పెద్దఅంబర్‌పేట, ఫిబ్రవరి 17 : ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు కొత్తగా ఆలోచించారు అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తారామతిపేట జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు. ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ అధ్యక్షతన స్కూల్ లీడర్ ఎన్నిక కోసం శనివారం మాక్ పోలింగ్ నిర్వహించారు. సాధారణ ఎన్నికల తరహాలో విద్యార్థులు వరుసలో నిలబడి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ప్రిసైడింగ్ అధికారి ఎదుట రహస్యంగా బ్యాలెట్‌లో తమ ఓటు వేశారు. ఉపాధ్యాయులతోపాటు విద్యార్థులు కూడా ఎన్నికల అధికారులుగా విధులు నిర్వర్తించారు. స్కూల్ లీడర్ కోసం పాఠశాల విద్యార్థులు అఖిలేశ్వర్, లహరి, రమ్యశ్రీ, సునీల్ పోటీపడ్డారు. ఓట్ల లెక్కింపు అనంతరం ఫస్ట్ లీడర్‌గా సునీల్ గెలుపొందినట్టు, రెండో లీడర్‌గా లహరి విజయం సాధించినట్టు ప్రిసైడింగ్ అధికారులు ప్రకటించారు. విజయం సాధించినవారికి హెచ్‌ఎం ప్రసాద్ నియామకపత్రాలు అందజేసి.. ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకటేశ్‌యాదవ్, ఉపాధ్యాయులు రామలింగం, సరస్వతి, మంజుల, విద్యార్థుల తల్లిదండ్రులున్నారు.



ఓటేసేందుకు వరుసలో నిల్చున్న విద్యార్థులు



ఓటేసినట్టు చూపుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

# ఉత్తమ ఫలితాలు సాధించాలి

### పదో తరగతి విద్యార్థుల అవగాహన సమావేశంలో రంగారెడ్డి డీఈవో సుశీందర్‌రావు

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 17 : ప్రణాళికాబద్ధంగా చదివి ఉత్తమ మార్కులు సాధించాలని రంగారెడ్డి జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు సూచించారు. శంషాబాద్ మండలంలోని పెద్దషాపూర్‌లో రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని రాజేంద్రనగర్, గండిపేట్, శంషాబాద్ మండలాలలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎంఈవో రాంరెడి ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సమావేశానికి ముఖ్య అతిథిగా సుశీందర్‌రావు మాట్లాడుతూ.. బట్టీ చదువులు కాకుండా ప్రణాళిక ద్వారా ఒక్కో సబ్జెక్టులో ముఖ్యమైన అంశాలను ఎంచుకొని వాటిని పూర్తి స్థాయిలో చదివి ఉత్తమంగా మార్కులు సాధించేలా పరీక్షలు రాయాలన్నారు. ప్రతి రోజు ఉదయం నిద్రలేచిన వెంటనే రెండు గంటలపాటు చదవడంతో పాటు రాసుకోవాలన్నారు. తిరిగి పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయులు చెప్పే అంశాలను తెలుసుకొని ఏదైనా అర్థం కాని అంశం ఉంటే ఉపాధ్యాయుల చేత తిరిగి చెప్పించుకోవాలని సూచించారు. పాఠశాలలో చెప్పిన అంశాలను దీంతో పాటు సాయంత్రం రెండు గంటల పాటు మరోసారి చదువుకోవాలన్నారు. ఇలా ప్రణాళికాబద్ధంగా చదువుకున్నప్పుడే మంచి మార్కులు సాధించే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో శంషాబాద్ ఎంపీపీ జయమ్మ, జడ్పీటీసీ రాజు, వైస్ ఎంపీపీ నీలం నాయక్, ఎంపీటీసీ ఎల్లయ్య ముదిరాజ్ ఉన్నారు.

## జోరుగా చేపల విక్రయాలు

షాబాద్, ఫిబ్రవరి 17 : షాబాద్ పహిల్వాన్ చెరువు వద్ద చేపల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.7కోట్లతో మిషన్ కాకతీయ ద్వారా ఈ చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేశారు. చెరువు పూడికతీత పనులు చేపట్టడంతో భారీగా కురిసిన వర్షాలకు చెరువు నిండి నీటితో కళకళలాడుతున్నది. అప్పటి ప్రభుత్వం మత్స్యకారులను ప్రోత్సహించేందుకు చెరువులో ఉచిత చేప పిల్లలను వదిలే కార్యక్రమాన్ని చేపట్టింది. చెరువులో వదిలిన చేప పిల్లలు ప్రస్తుతం పెద్దగా కావడంతో శనివారం చెరువు వద్ద మత్స్యకారులు చేపల విక్రయాలు చేపట్టారు. కిలో చేప రూ.150 నుంచి రూ.200 వరకు ధర పలకడంతో మంచి లాభాలు ఉన్నాయని మత్స్యకారులు చెబుతున్నారు.



చెరువు వద్ద చేపలు విక్రయిస్తున్న మత్స్యకారులు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సుదర్శన్

## మార్చి 8న నేషనల్ లోక్‌అదాలత్

వికారాబాద్, ఫిబ్రవరి 17 : మార్చి 9న నిర్వహించే నేషనల్ లోక్‌అదాలత్‌లో వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న, రాజీ పడదగిన కేసులు, 498–ఏ కేసులు, ఎక్సైజ్, డ్రంక్ అండ్ డ్రైవ్, గేమింగ్ యాక్ట్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కేసులు, రాజీ మార్గం ద్వారా పరిష్కారం కోసం కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సుదర్శన్ జిల్లా పోలీసులకు సూచించారు. శనివారం వికారాబాద్ జిల్లా కోర్టు హాల్‌లో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ, వికారాబాద్ వారి ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్‌ల అధికారులతో కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తి చంద్రకిశోర్, జిల్లా న్యాయసేవ అధికార సంస్థ సెక్రెటరీ సీనియర్ సివిల్ న్యాయమూర్తి డీబీ శీతల్, న్యాయమూర్తి శ్రీకాంత్, న్యాయమూర్తి శృతి దూత, ఎక్సైజ్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని కాపాడిన ఎస్సై మైబెల్లి

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 17 : ఇబ్రహీంపట్నం రాయపోల్ రోడ్డులో ఆత్మహత్య చేసుకోబోతున్న వ్యక్తిని సీపీఆర్ చేసి ఇబ్రహీంపట్నం ఎస్సై మైబెల్లి కాపాడారు. శనివారం సాయంత్రం రాయపోల్ రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తుండగా.. పశ్చిమబెంగాల్‌కు చెందిన సంతోష్ ముఖర్జీ అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడేందుకు వెళ్లిన విషయాన్ని స్థానికుల ద్వారా తెలుసుకున్నారు ఎస్సై మైబెల్లి. సిబ్బంది చంద్రశేఖర్, యాదగిరి, సాయిరెడ్డితో వ్యక్తిని వెతుక్కుంటూ వెళ్లగా రాయపోల్ రోడ్డులోని ఓ పొలంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడుతున్నాడు. అతడు చనిపోయాడని భావించారు. వెంటనే అప్రమత్తమైన ఎస్సై మైబెల్లి ఉరేసుకున్న వ్యక్తిని దించి సీపీఆర్ చేసి అతడి ప్రాణాలు కాపాడాడు. అనంతరం స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్సై మైబెల్లి, సిబ్బందిని స్థానికులు అభినందించారు.